క్లుప్తంగా

ఆర్టీసీ సర్వీసుల్లేక అవస్థలు

సీతంపేట: పాలకొండ నుంచి రాత్రి 7.30 తర్వాత ఆర్టీసీ బస్సులు సీతంపేటకు లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని పలువురు ప్రయాణికులు తెలిపారు. పాలకొండ వైపు వెళ్లాలంటే ఉదయం 7 గంటల వరకు బస్సు లేదని వాపోతున్నారు. గతంలో రాత్రి 9.30 గంటలకు కొత్తూరు వైపు, ఉదయం సమయంలో ఐదు గంటలకు విశాఖపట్నం వెళ్లడానికి బస్సు ఉండేదని ఇప్పుడు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు తెల్లారేసరికి వెళ్లాలంటే గమ్యం చేరలేకపోతున్నామన్నారు. ఈ మేరకు ఐటీడీఏ పీఓ బి.నవ్య దృష్టికి కూడా ఈ విషయం తీసుకువెళ్లినట్టు పలువురు ప్రయాణికులు తెలిపారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వేలం పాట ఆదాయం రూ.7.25 లక్షలు


వేలంపాటలో పాల్గొన్న స్థానికులు

వీరఘట్టం: మేజరు పంచాయతీలోని అంబేడ్కర్ జంక్షన్‌తో పాటు కొత్త బస్టాండ్‌లో ఉన్న పంచాయతీ షాపులు, ప్లాట్లుకు అద్దె ప్రాతిపదికన శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో పంచాయతీకి రూ.7.25 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ వి.రామచంద్రరరావు తెలిపారు. కొత్త బస్టాండ్‌లో ఉన్న ఎనిమిది షాపుల్లో ఐదు షాపులను రూ.1.19 లక్షలకు వేలం పాడగా ఇంకా నాలుగు షాపులను పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదని పేర్కొన్నారు. మొత్తం పంచాయతీకి రూ.7,25,500లు ఆదాయం వచ్చిందని తెలిపారు. సర్పంచ్ పులిటి గౌరమ్మ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించారు.

పౌష్టికాహార వారోత్సవాలు


ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధి రెల్లివీధిలో పౌష్టికాహార వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త బి.మరవేణి నేతృత్వంలో గర్భిణులకు రక్తహీనతను అధిగమించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం విలువలపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్త కె.గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

300పశువులకు టీకాలు


చాకరాపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ గణేష్

బలిజిపేట: మండలంలోని పి.చాకరాపల్లి గ్రామంలో 300పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు వేశారు. మండల పశువైద్యశాఖ అధికారి గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేర చేపట్టినట్లు గణేష్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.మోహనరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా పశువులకు వ్యాక్సిన్

సీతానగరం: మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేగవంతం చేయాలని సీతానగరం పశుసంవర్ధక శాఖ సబ్ డివిజన్ ఎ.డి సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈమేరకు శుక్రవారం బలిజిపేట,సీతానగరం మండలాల్లో జరుగుతున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెలాఖరులోగా తెల్ల, నల్ల పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ మండల పశువైద్యాధికారుల పర్యవేక్షణలో పశువైద్య సిబ్బంది సీతానగరం మండలంలోని 5,988 పశువులకు, బలిజిపేటలో 9,941 పశువులకు టీకాలు వేశారన్నారు.

మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన

పాలకొండ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమన్‌ఎంపవర్‌మెంట్ సెల్ కార్యక్రమాన్ని వైస్ ప్రిన్స్‌పాల్ బి.ప్రభాకర్ నేతృత్వంలో చేపట్టారు. ఈ సందర్భంగా స్త్రీ, ప్రసూతివైద్య నిపుణురాలు రౌతు భారతితో అవగాహనా కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ రక్తహీనత, రుతు సమస్యలు, పౌష్టికాహార విలువలపై వివరించారు. కార్యక్రమంలో రూసా కోఆర్డినేటర్ కె.శ్రీనివసరావు, సీహెచ్.రాఘవేంద్రరావు, ఎం.ఎస్.కుమార్, పి.రాజ్యలక్ష్మి, ఎం.ప్రశాంతి, శంకరరావు పాల్గొన్నారు.

చింతపండు కొనుగోలు లక్ష్యాలు అధిగమించాలి

- జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్రకుమార్


సీసీపీఏలకు సూచనలిస్తున్న జీసీసీ డీఎం మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: చింతపండు కొనుగోలు లక్ష్యాలను అధిగమించాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ కార్యాలయంలో సీసీపీఏలతో శుక్రవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాణ్యతతో కూడిన చింతపండును మాత్రమే కొనుగోలు చేయాలని, అమ్మకాలు చేపట్టిన తక్షణమే నగదును చెల్లించాలంటూ పలు సూచనలు చేశారు.

చింతపండు తడపొద్దు

బరువు ఎక్కువ అవుతుందన్న ఆశతో చింతపండును తడపటం వల్ల తిరిగి నష్టమే కలుగుతుందన్న సత్యాన్ని గ్రహించాలని జీసీసీ డీఎం మహేంద్రకుమార్ గిరిజనులను కోరారు. జీసీఎంఎస్ కార్యాలయంలో డీఎం విలేకర్లతో మాట్లాడారు. జీసీసీ ద్వారా చింతపండు కిలోను రూ.32.40లకు కొనుగోలు చేస్తుండగా బయట వ్యాపారులు కిలో చింతపండును రూ.22 నుంచి రూ.24కు కొనుగోలు చేస్తున్నారని, జీసీసీకి, బయటి వ్యాపారులకు మధ్య కొనుగోలులో వ్యత్యాసం రూ.8లకు పైగా ఉందన్నారు. తడిసిన/తడిపిన చింతపండును వ్యాపారులకు ఇచ్చి తక్కువ ధరను పొంది నష్టపోకుండా చింతపండు తడపకుండా/తడిసిపోకుండా జాగ్రత్తగా సేకరించి జీసీసీ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ఆదాయం పొందాలని గిరిజనులకు సూచించారు. డివిజనల్ పరిధిలో ఈ సీజన్లో 11,300 క్వింటాళ్ల చింతపండును కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా చేసుకోగా ఇప్పటి వరకు 1400 క్వింటాళ్ల చింతపండును మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందన్నారు. వర్షాలు విపరీతంగా కురుస్తుండటం, తడిసిపోయి నాణ్యత లేని చింతపండును తీసుకొస్తుండటం వలన కొనుగోలు మందకోడిగా సాగుతోందన్నారు. ఆయన వెంట మేనేజర్ వి.కృష్ణప్రసాదరావు, అకౌంటెంట్ గణపతి తదితరులు ఉన్నారు.

సచివాలయ సిబ్బంది పనితీరు మారాలి


సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీఎల్‌డీఓ

పాలకొండ: ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించాల్సిన సచివాలయ సిబ్బంది పనితీరు సక్రమంగా లేకపోతే ఎలాగని డీఎల్‌డీఓ వీవీ గోపాలకృష్ణ ప్రశ్నించారు. మండలంలోని బెజ్జి సచివాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. సచివాలయంలో నలుగురు మాత్రమే సిబ్బంది ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఎంతో ఉన్నత లక్ష్యంతో సచివాలయాలను ఏర్పాటు చేస్తే సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకాకపోవడాన్ని ప్రశ్నించారు. ప్రజల నుంచి గ్రీవెన్స్ తీసుకోవాల్సి ఉన్నా ఎందుకు తీసుకోవడం లేదని మందలించారు. సిబ్బంది పనితీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నగర పంచాయతీలోని కోటదుర్గమ్మ సచివాలయాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు.

త్వరితగతిన సర్వే


సూచనలిస్తున్న ఎంపీడీఓ

సీతంపేట: గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలు, 6 – 19 వయసు గల ఆడ పిల్లల సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. శుక్రవారం అధికారులతో నిర్వహించిన గూగుల్ మీట్ ద్వారా దీనిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.గీతాంజలి వెల్ఫేర్ అసిస్టెంట్లకు పలు సూచనలిచ్చారు. ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు విస్తతంగా సర్వే చేయాలన్నారు. గ్రామ వలంటీర్లు కూడా సహకరించాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలలను సందర్శించాలని సూచించారు. బయోమెట్రిక్ ద్వారా చైల్డ్ ఆధార్ అథెంటికేషన్ చేయాలన్నారు.

త్వరగా పనులు పూర్తి చేయండి

జియ్యమ్మవలస: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్.రమేష్ తెలిపారు. మండలంలోని 10 సచివాలయాలకు సంబంధించి 86 పనులకుగాను రూ.153.33 లక్షలు మంజూరు చేయగా ఇప్పటివరకు 4 పనులు మాత్రమే పూర్తి చేశారన్నారు. 52 పనుల నామినేషన్ ప్రతిపాదనలు పాలకొండ పీఆర్ డివిజన్ కార్యాలయంలో ఉన్నాయని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు సహకరించాలన్నారు. గ్రాంట్ల విషయంలో ఎటువంటి జాప్యం ఉండదన్నారు. పనులు పూర్తి చేసిన వెంటనే సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బిల్లులు చేస్తారని తెలిపారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత


బాధిత కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు

కురుపాం: బాధిత కుటుంబాలు వైఎస్సార్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గుమ్మిడిగూడ గ్రామానికి చెందిన తాడంగి మోహనరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు నగదు బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. సర్పంచ్ శెట్టి సురేష్, సచివాలయ కార్యదర్శి కర్రి రామచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు


బిటివాడ జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

వీరఘట్టం: ఏప్రిల్ 3 నుండి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈఓ పర్రి కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన బిటివాడ జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. అన్ని గదుల్లో బెంచీలు ఏర్పాటు చేయాలని, ఫ్యాన్లు ఉండేలా చూడాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని హెచ్.ఎం రత్నాకరరావుకు సూచించారు. ఈ ఏడాది మండలంలోని గంగమ్మపేట ఆశ్రమ పాఠశాల, నీలానగరం, బిటివాడ, వీరఘట్టం బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మొత్తం 668 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

లక్ష్యాలు పూర్తి చేయండి


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

పాలకొండ రూరల్: గ్రామ ప్రజల సమన్వయంతో గుర్తించి చేపడుతున్న ఉపాధి హామీ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు కోరారు. పాలకొండ మండలం తుమరాడ గ్రామంలో చేపట్టిన రామప్ప చెరువు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఉపాధి వేతనదారులతో మాట్లాడుతూ పనులు జరిగేచోట సమకూర్చిన మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం బుక్కూరు సచివాలయాన్ని సందర్శించారు. అక్కడి సిబ్బందికి వేసవి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

● లివిరిలో శిలువ యాత్ర



మండలంలోని లివిరిలో క్రైస్తవ దీక్షాపరులు శిలువ యాత్రను శుక్రవారం చేపట్టారు. యాత్రలో క్రైస్తవ భక్తి గీతాలు ఆలపించారు. బత్తిలి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ సనాతన్, రాజుల ఆధ్వర్యంలో దీక్షాపరులు దేవుని వ్యాఖ్యలు వినిపిస్తూ పురవీధుల్లో పాదయాత్ర చేశారు. లివిరి, భామినికి చెందిన దీక్షాపరులు, విశ్వాసకులు పాల్గొన్నారు.

–భామిని

29న సంతవేలం పాట

సీతంపేట: సీతంపేట సంత బహిరంగ వేలం పాట, రోజువారీ పాట ఈ నెల 29న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు గ్రామ కార్యదర్శి సుదర్శనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజువారీ మార్కెట్‌కు, వారపు సంతలకు దాఖలు చేయబడిన సాల్వెన్సీ విలువ రూ.లక్ష, ధరావత్తు రూ.10 వేలు చొప్పున చెల్లించాలన్నారు. పంచాయతీకి బకాయిలు ఉన్న వారు వేలం పాటకు అనర్హులన్నారు. వేలం పాట వాయిదా వేయడానికి, రద్దు చేయడానికి పంచాయతీకి పూర్తి అధికారం ఉందన్నారు. ఇతర వివరాలకు కార్యాలయాన్ని సందర్శించాలని సూచించారు.

అద్దెకు ఐటీడీఏ దుకాణాలు

సీతంపేట: ఐటీడీఏ షాపులు అద్దెకు ఇవ్వనున్నట్టు ప్రాజెక్టు అధికారి బి.నవ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనిటీ భవనం ఎదురుగా షాపులు నెలసరి అద్దె చెల్లింపు ప్రాతిపదికన గుడ్‌విల్ మొత్తం రూ.లక్ష డిపాజిట్ చెల్లించాలన్నారు. వచ్చేనెల 1వ తేదీలోగా ఆసక్తి గల గిరిజనులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 93939 17692 నంబరును సంప్రదించాలని సూచించారు.

నేడు మండల సమావేశం

జియ్యమ్మవలస: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరుగుతుందని ఎంపీడీఓ ఎస్.రమేష్ శుక్రవారం తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ఆయా గ్రామాల సమస్యలు, ప్రతిపాదనలు ఏమైనా ఉంటే రాత పూర్వకంగా తీసుకురావాలని కోరారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

కొమరాడ: రోడ్డు ప్రమాదంలో గత నెల 22న చోళ్లపథం మలుపు వద్ద చనిపోయిన దేవుకోన పంచాయతీ అంటివలస గ్రామానికి చెందిన బాధిత కుటుంబాల సభ్యులకు డాక్టర్ శెట్టి మధుసూదనరావు, ద్వారపురెడ్డి జనార్దనరావు రూ.75వేలు ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అంతా అండగా ఉండాలన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాదలింగి విద్యార్థుల ప్రతిభ

కొమరాడ: ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో మాదలింగి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన మీసాల ఐశ్వర్య 138 మార్కులు సాధించి తన ప్రతిభ చాటింది. జిల్లాలో రెండో స్థానంలో నిలిచిందని పాఠశాల హెచ్ఎం ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఐశ్వర్యతో పాటు కె.నూకరాజు, ఎస్.గాయత్రి, తనుజా, ఎస్.హేమలత, పి.వర్షిత, ఎస్.అరవింద్, కె.అంజిలి ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఎన్ఎంఎంఎస్‌లో గణేష్


బొడ్డేపల్లి గణేష్

పాలకొండ రూరల్: మండలంలోని అంపిలి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన బొడ్డేపల్లి గణేష్ శుక్రవారం విడుదలైన (ఎన్ఎంఎంఎస్)నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎం.సోమేశ్వరరరావు, గైడ్ టీచర్ టి.ఎస్.శివాజీ తదితరులు మాట్లాడుతూ మిగిలిన విద్యార్థులు కూడా పోటీ పరీక్షల్లో తమ ప్రతిభ చాటాలన్నారు. గణేష్‌ను అభినందించారు.

28న మండల సమావేశం

వీరఘట్టం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న ఉదయం పది గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు ఆధ్వర్యంలో జరగనున్న సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

వీరఘట్టం: మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని ఎస్ఐ ఎం.హరికృష్ణ సూచించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్ట ప్రకారం నేరమని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులు కూడా శిక్షార్హులని తెలిపారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ


చలో ఢిల్లీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ: కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమంపై ఆశ వర్కర్లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలతో పాటు కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్నామన్నారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చేపడుతున్న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

భయం వీడండి : డిప్యూటీ ఈఓ

జియ్యమ్మవలస: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు భయం వీడాలని ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ, ఏఎంఓ మోహనరాయుడు సూచించారు. మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం జరిగిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో వారు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఎలా ఉండాలి, రానున్న 10వ తరగతి పరీక్షల్లో ఎలా ప్రిపేరు కావాలి, సమాధానాలు ఏ విధంగా రాయాలి అనే వాటిపై సూచనలు చేశారు.

విద్యార్థులకు పరీక్షల కిట్‌లను డిప్యూటీ ఈఓ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్.తిరుపతిరావు, వార్డెన్ సాంబమూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఈఈ సుధారాణి

కురుపాం: సమస్యల పరిష్కారంపై ప్రతీ ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్ ఈఈ ఎస్.సుధారాణి అన్నారు. కురుపాం మండల పరిషత్ కార్యాలయంలో మండల ఇంజినీరింగ్ అధికారి పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఈఈ సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేపట్టిన పనులు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్దేశించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

మార్చి ఆర్థిక సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా పనులు పూర్తి చేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో 20 సచివాలయాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు, పీఆర్ జేఈ ఫణీష్

కొమరాడ: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎల్‌వీ అప్పారావు, మండల ఇంజినీరింగ్ అధికారి ఫణీష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఏడు సచివాలయాల్లో ఒక సచివాలయానికి రూ.20లక్షల చొప్పున 57 పనులకుగాను రూ.1.07 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులకు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు ఎదురైనా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వేతనదారుల సంఖ్య పెరగాలి


సుంకిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ గోపాలరావు

గరుగుబిల్లి: పంచాయతీల్లో వేతనదారుల సంఖ్యను పెంచాలని ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర, సంతోషపురం, సుంకి పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం వచ్చేలా ముందస్తు కొలతలు వేసి పనులను నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమయ పాలన పాటిస్తే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. రైతులకు ఉపయోగపడే పనులను నిర్వహించాలన్నారు. మస్తర్లలో తేడాలు వస్తే చర్యలు తప్పవన్నారు. ఏపీఓ టి.రామకృష్ణ, టీఏలు నర్సింహ, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న బోర్ల సామగ్రి


మండలానికి చేరిన బోర్ల సామగ్రి

గరుగుబిల్లి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు బోర్ల సామగ్రిని అందుబాటులోకి అధికారులు తెచ్చారు. గ్రామ పంచాయతీలో ఏటా వేసవిలో బోర్లు మరమ్మతులు నిర్వహించేందుకు క్రాష్ ప్రోగ్రాన్ని నిర్వహించేవారు. ఈ ఏడాది వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా బోర్లకు మరమ్మతులను నిర్వహించేందుకు సామగ్రిని రప్పించారు. 25 పంచాయతీల్లో మరమ్మతులకు గురైన బోర్లను గుర్తించి అవసరమైన సామగ్రిని అందజేయడం జరుగుతుందని ఎంపీడీఓ పైడితల్లి తెలిపారు. బోర్లు మరమ్మతులకు గురైతే తక్షణం సమాచారాన్ని కార్యాలయానికి అందించాలన్నారు.

ఆదాయ మార్గాల పెంపునకు కృషి


చెత్త సంపద కేంద్రంలో మొక్కకు నీరు పోస్తున్న డీపీఓ సత్యనారాయణ

గరుగుబిల్లి: పంచాయతీల్లో ఆదాయ మార్గాలను పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ బి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని సుంకి పంచాయతీలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులను వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చేయడంతో పాటు వీధి దీపాలను నిర్వహించాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని సూచించారు. చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రాలను సక్రమంగా నిర్వహించి సేంద్రీయ ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సర్పంచ్ కె.రవీంద్ర తదితరులు ఉన్నారు.

'భోజనం' మెనూ పాటించాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ, గ్రామ సర్పంచ్

కురుపాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందివ్వాలని కురుపాం వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, నీలకంఠాపురం సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు అన్నారు. నీలకంఠాపురం గిరిజన సంక్షేమ యూపీ పాఠశాలను మధ్యాహ్న భోజన సమయంలో శుక్రవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం భోజనం, నాణ్యతలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.